రేషన్ కార్డుల సర్వే పూర్తి

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో రేషన్ కార్డుల సర్వే పూర్తయిందని సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా 2977 దరఖాస్తులు రాగా 2452 మందిని అర్హులుగా గుర్తించినట్లు డీసీ తెలిపారు. ఈ జాబితాను సివిల్ సప్లై కార్యాలయానికి పంపామని ఫిబ్రవరి మొదటి వారంలో వార్డు కార్యాలయంలో జారీ చేస్తారన్నారు.

అన్నదానం


అన్నదాన వితరణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చంపాపేట: అన్ని దానాల కన్నా ఆకలిని తీర్చే అన్నదానం గొప్పదని శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ భగవాన్‌జీ అన్నారు. బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడు గుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ ఆమ్మవారి ఆలయం ముందు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌జీ మాట్లాడుతూ...ప్రతీ అమావాస్య రోజు అన్న ప్రసాదాన్ని వితరణ చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, ఘనసాల చింటు, రాజు, వెంకటేష్, రాజేష్, రమేష్, శ్రీను, మహేశ్వర్‌రెడ్డి, హరిలాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆటో సాయినగర్‌లో కొనసాగుతున్న నూతన మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట మహేందర్‌రెడ్డి, పార్వతి, తదితరులు ఉన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ఆయా కాలనీలు, బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్జీవో కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట ఏఈ రాజ్‌కుమార్, కాలనీ ప్రతినిధులు నాగేశ్వరరావు, సోమేశ్వర రావు, సీబీఎస్.రాజు, కేవీఎస్ శేఖర్, గణేశ్, శారద,మీనాక్షి,ఆనందరావు, శ్రీకాంత్, శాంతరాజు, జిల్లా అధికార ప్రతినిధి శరత్‌కుమార్, సీనియర్ నాయకులు శ్రీధర్‌రావు, సుధీర్ పాల్గొన్నారు.

విజయ్‌కుమార్ గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకున్న విజయ్‌కుమార్‌గౌడ్

నాగోలు: పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ..పేదలకు అండగా నిలుస్తున్న నాగోలు సుప్రజ ఆసుపత్రి ఎండీ శిగ విజయ్‌కుమార్ గౌడ్‌కు కెనడాకు చెందిన బ్రోమిటోన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ప్రతినిధులు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ శివప్ప, డాక్టర్ సురేష్ గుప్తా విజయ్‌కుమార్ గౌడ్‌కి డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం బృందం మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చి తాము అందిస్తున్న సేవలను పరిశీలించిందని చెప్పారు. డాక్టరేట్ తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు.

దుర్గంధం.. దోమల విజృంభణ

- పారిశుద్ధ్య నిర్వహణ లేక కంపు కొడుతున్న కాలనీలు
- చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



డ్రైనేజీ లీకేజీతో పారుతున్న మురుగు
మురుగు నీటితో ప్రవహిస్తున్న మూసీనది

దిల్‌సుఖ్‌నగర్: కాలనీలు, బస్తీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దుర్గంధంగా మారి దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే మూసీ ప్రవహిస్తుండటంతో సాయంత్రమైతే చాలు దోమలు ఇళ్లల్లోకి దూసుకొస్తున్నాయని వాపోతున్నారు. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని బస్తీలు, మురికివాడలు, కాలనీలల్లో నిత్యం దోమలు, ఈగలతో కుస్తీ పట్టాల్సి వస్తోందంటున్నారు. శానిటేషన్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో దోమకాట్లకు గురై రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌టీఆర్‌నగర్, సింగరేణికాలనీ, ఓల్డ్‌మలక్‌పేట్, తీగలగూడ, అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, సింగరేణి కాలనీ, అజంపుర, ఛావుణి తదితర ప్రాంతాల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది.


సింగరేణి, వాంబేకాలనీ సముదాయం వద్ద



అధికారుల నిర్లక్ష్యం..

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రచారాలు చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్యలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నిర్మూలన కార్యక్రమాలకు రూ. లక్షల్లో ఖర్చవుతున్నా దోమల నివారణ మాత్రం సాధ్యం కావడం లేదని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. మూసీ తీరానికి అనుకుని ఉన్న మూసారంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీల వాసులు నిత్యం దోమల బెడదతో ఇక్కట్లు పడాల్సిందే.

కానరాని ఫాగింగ్..

దోమల నివారణకు ఇతర కాలనీల్లో ఫాగింగ్ చేస్తారు. ఈ డివిజన్‌లో మాత్రం ఫాగింగ్ అనే మాట వినపడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం సమయంలో కనీసం ఫాగింగ్ చేస్తే అయినా కాస్తా ఊరట నిస్తోందని ఎన్నిసార్లు చెప్పినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దోమల బెడదతో కంటిమీద కునుకు లేక అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు. వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు నీరు రోడ్లపై ప్రవహించి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వివిధ ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్ నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.23, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.28, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దో సకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలు కడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సాయిరాంనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. 3.30 నుంచి సాయంత్ర 4.30 గంటల వరకు చంపాపేట పాతబస్తీ, కటకోనికుంట, సాయిరాంనగర్, ఆర్‌టీసీ, ఆఫీసర్స్, వైశాలీ నగర్, నాగార్జున, భానునగర్, సింగరేణి, కేశవనగర్ పరిసర కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అనాథ విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు

ఆర్థిక సాయం చేసిన జక్కిడి రఘువీర్


ఆర్థిక సహాయం అందజేస్తున్న జక్కిడి మల్లారెడ్డి, రఘువీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్/మన్సూరాబాద్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం ఉంటూ నీట్‌లో 3994 ర్యాంక్ సాధించి మంచిర్యాల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన దాసరి మహంకాళి కాలేజీ ఫీజు కట్టడానికి ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అనాథ విద్యార్థి గృహం అధ్యక్షులు మార్గం రాజేష్ జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా దాసరి మహంకాళికి డాక్టర్ కోర్సు పూర్తయ్యే కాలేజీ ఫీజు మొత్తం జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మొదటి విడతగా రూ. 40 వేల చెక్కును బీఆర్ఎస్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి చేతుల మీదుగా బుధవారం మహంకాళికి అందజేశారు.

మంద కృష్ణకు పద్మశ్రీ ప్రకటించడం హర్షణీయం

మన్సూరాబాద్: మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రకటించడంపై జైభారత్ హర్షం వ్యక్తం చేస్తుందని, సంస్థ జాతీయ కార్యదర్శులు లోకనాథ్, రజనీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను అట్టడుగు కులం వారికి కూడా చేరాలని, ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్‌తో మంద కృష్ణమాదిగ గత మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని చేపట్టారని అన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా మాదిగ దండోరా ఉద్యమాన్ని, వికలాంగులు, వితంతులు, వృద్ధులు, అనేక ప్రజా ఉద్యమాలను నడిపించిన మంద కృష్ణకు విశిష్ట పురస్కారం దక్కడం హర్షణీయమన్నారు.

నిలకడగా డాక్టర్ ప్రణీతారెడ్డి ఆరోగ్యం

పోలీసులపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు: ఇన్‌స్పెక్టర్

చైతన్యపురి: అత్తింటివారు వేధిస్తున్నారని నిద్ర మాత్రలు, క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న వైద్యురాలు ప్రణీతారెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తుంది. కర్మన్‌ఘాట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రణీత భర్త సికందర్‌రెడ్డితో మనస్పర్థలు రావటంతో రెండేళ్ల నుంచి విడిగా ఉంటుంది. వరకట్న వేధింపులు, విడాకుల కేసు కోర్టులో ఉన్నట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదనే ఆరోపణల్లో వాస్తవం లేదని మంగళవారం ప్రణీత ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేశామని, ఘటన అనంతరం సికందర్‌రెడ్డి తల్లిదండ్రులపై దాడి చేసిన ఆరుగురిపై కూడా మరో కేసు నమోదు చేశామన్నారు. గత కొంత కాలంగా ప్రణీతకు అత్త, మామలతో గొడవలు జరుగుతున్నాయని. ప్రణీత ఏ ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఆయన స్పష్టం చేశారు. తమకు ఎవరికి వత్తాసు పలకాల్సిన అవసరం లేదని ఇరు కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పరస్పర కేసులు నమోదు చేశామన్నారు. ఇంటి ముందు టెంట్ వేసి ప్రణీత నిరసన తెలిపితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని ఆమెకు చెప్పటం జరిగిందని, తర్వాత ఇంటిలోపల టెంట్ వేసి నిరసన తెలిపిందన్నారు. కుటుంబ తగాదాలు, కోర్టు కేసులు ఉన్న నేపథ్యంలో పోలీసులపై ఆరోపణలు చేయటం తగదని ఇన్‌స్పెక్టర్ అన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు మార్గదర్శకులు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

హయత్‌నగర్: రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహితంగా బస్సులను నడుపుతున్న ఆర్టీసీ డ్రైవర్లు ఇతర డ్రైవర్లకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని, హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని హయత్‌నగర్–1 డిపోలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్, ర్యాష్ డ్రైవింగ్ చేయకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ఈ సందర్భంగా ప్రమాద రహితంగా బస్సులను నడుపుతున్న ఉత్తమ డ్రైవర్లను ఆమె సన్మానించారు. రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ రీజినల్ మేనేజర్లు జగన్, సుచరిత, బాబూనాయక్, డీఎంలు విజయ్, శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ శ్రీశైలం, వనస్థలిపురం సీఐలు బొలిశెట్టి శ్రీను, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం


సింగరేణి కాలనీలో పర్యటిస్తున్న డీసీ శైలజ

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని వాంబే గృహ సముదాయాలు, గుడిసెల ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ అన్నారు. బుధవారం సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించిన డీసీ విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని స్థానికుల సమస్యలపై ఆరా తీశారు. కాలనీలో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు ఏరులై పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గృహ సముదాయాల నడుమ పేరుకుపోతున్న చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలో పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల రాజకీయ పార్టీ యాకత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి నంద్యాల అనిల్‌కుమార్, కమలాకర్, మహేష్, అనిల్, వినయ్, అఖిల్ పాల్గొన్నారు.

మూతపడిన రోడ్డుమీదుగా రాకపోకలు షురూ


మూతపడిన రోడ్డుమీదుగా రాకపోకలు సాగిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ నుంచి జాతీయ రహదారికి వెల్లే రోడ్డు గత 19 ఏళ్లుగా మూతపడి ఉంది. వివిధ కాలనీలతో కలిపి జాక్ ఏర్పాటు చేసి మూతపడిన రోడ్డుపై నుంచి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి రాకపోకలు సాగించడం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బొమ్మలగుడి నుంచి వినాయక్‌నగర్, ఆర్టీసీ కాలనీవాసులు సులభంగా జాతీయ రహదారికి చేరుకునేందుకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గత 19 ఏళ్లుగా మూతపడి ఉన్న రోడ్డును కాలనీవాసుల సహకారంతో రాకపోకలు సాగించడం సంతోషకరమన్నారు. ఈ రోడ్డు గుండానే డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, జాక్ కమిటీ అధ్యక్షుడు గుర్రం బాల్‌రెడ్డి, కాలనీలవాసులు సీతారామశర్మ, కళ్లెం శంకర్‌రెడ్డి, జెట్ట మహేష్, కొండల్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మణ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, రమణ, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ ఈటల

ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ వీరభద్రీయ(వీరముష్టి) సంఘం గోల్డెన్ జుబ్లీని పురస్కరించుకుని వారం రోజులుగా కుంట్లూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బుధవారం ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. చిన్న కులాలు, సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వీరభద్రీయ సంఘంతో ఎన్నో ఏళ్లుగా తనకు మంచి సంబంధాలు ఉన్నాయని వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చిన్న కులస్తులలోని యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. విజేతలుగా నిలిచిన మూసారాంబాగ్ మార్కోస్ టీమ్, రన్నరప్‌గా నిలిచిన చీరాల చాలెంజర్స్ టీమ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, పోచయ్య, కొండయ్య, నరహరి, రవికుమార్, జంగయ్య, పెద్ద వీరస్వామి, యాదయ్య, శివరాజ్, విజయ్‌చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత ఉపకులాలకు అండగా ఉంటా

- ఎస్సీ కులాల వాటాను మాలలు దోచుకున్నారు
- మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న కృష్ణమాదిగ

మన్సూరాబాద్: ఎస్సీ కులాల రిజర్వేషన్లను గత కొన్నేళ్లుగా మాలలు మాత్రమే దోచుకుని అనుభవించారని, దళిత ఉపకులాలకు అండగా ఉంటానని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ, మాదిగ ఉపకులాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు ఆనాటి నుంచి నేటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఒక్క మాలలు మాత్రమే పొందారన్నారు. తమ జనాభా కన్నా ఎక్కువ రిజర్వేషన్లను అనుభవించింది మాలలు అని నివేదికలు స్పష్టంగా తెలిపాయని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా మనందరి రిజర్వేషన్ ఫలాలను దోచుకుని అనుభవిస్తున్న మాలలకు వర్గీకరణలో తక్కువ వాటా వచ్చేలా వర్గీకరణ కమిషన్‌పై ఒత్తిడి చేద్దామని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణపై స్పందించడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, ఎస్సీ ఉపకులాల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి హనుమంతు, చింతల రాజలింగ, డాక్టర్ చంద్రమౌళి, కొడగంటి నర్సింహా, బాణాల మంగేష్, తూర్పాటి కృష్ణ, సిరిగిరి మన్నెం, ఇప్ప కృష్ణ, జోగు రాములు, ఆడాల రమేష్, గజవెల్లి ఈశ్వర్, సాలమ్మ పాల్గొన్నారు.

ముగిసిన జైళ్ల శాఖ రీట్రీట్–2024

సైదాబాద్: తెలంగాణ జైళ్ల పరిపాలనలో సాంకేతికత, నైపుణ్య అభివృద్ధి, ఆధునీకరణను వినియోగిస్తామని డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా తెలిపారు. చంచల్‌గూడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సీకా) కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జైళ్ల శాఖ రీట్రీట్–2024 సమావేశాలు బుధవారంతో ముగిసాయి. ముగింపు సమావేశాలకు రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య వ్యసన నివారణకు డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మహిళా జైళ్లలో ఎదురవుతున్న సవాళ్లకు తగిన పరిష్కారాలు రూపొందిస్తామన్నారు.

ప్రమాదకరం.. పట్టించుకోరేం?



వీధి దీపాలను ఆన్‌ఆఫ్ చేసేందుకు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన స్విచ్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీ పార్కు సమీపంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన బాక్స్ పగిలిపోయి విద్యుత్ తీగలు బయటకు వేలాడుతున్నాయి. తక్కువ ఎత్తులోనే ఉండటంతో పిల్లలు చేతులు పెట్టే ప్రమాదం ఉందని సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన బాక్సుకు మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– చైతన్యపురి

చెత్తమయం.. తరలించరేం?



కాలనీలు, బస్తీల్లో పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో దుర్గంధంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని మునుగనూర్‌కు వెళ్లే కల్వర్టు వద్ద గత కొన్ని రోజులుగా చెత్తా చెదారం పేరుకుపోవడంతో అటుగా రాకపోకలు సాగించే క్రమంలో దుర్వాసన వస్తోందని సంబంధిత సిబ్బంది స్పందించి పేరుకుపోయిన వ్యర్థాలను తరలించాలని కోరుతున్నారు.

–ఎల్‌బీనగర్

జాన్ వెస్లీకి సన్మానం



దిల్‌సుఖ్‌నగర్: సీపీఎం రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీని ఎన్టీఆర్‌నగర్ సీపీఎం శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్‌నగర్ శాఖ కార్యదర్శి ముదావత్ గోపినాయక్, కట్ట శ్రీనివాస్, రామావత్ పాండు నాయక్ మాట్లాడుతూ.. జాన్ వెస్లీ యువజన సంఘం నుంచి సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరకు ఎదిగే క్రమంలో అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో పార్టీ, ప్రజా సంఘాలను అభివృద్ధి చేయడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కార్యకర్తలు ముందుంటారన్నారు.